డిటెక్టివ్ స్టోరీ

# తలనొప్పి

కొన్ని వారాలుగా రాజారావు తలనొప్పితో బాధపడుతున్నాడు. మామూలు నొప్పి కాదు. తల చిట్లి పోతుందేమోననిపిస్తుంది. క్రోసిన్లు, అనాసిన్‌లు పనిచెయ్యలేదు. ఇంటి పక్కనున్న డాక్టరుకు చూపించుకున్నాడు. ఆయనిచ్చిన మందుల వల్ల కూడా ఫలితం కనిపించలేదు. ఇదేదో సీరియస్ కేసు లాగే ఉంది. న్యూరోఫిజిషియన్‌తో అప్పాయింట్‌మెంట్ తీసుకొన్నాడు.

పేషెంట్‌ను పూర్తిగా పరీక్షించి, చెయ్యవలసిన టెస్టులన్నీ చేసి కళ్ళలో విషాదం నింపుకొని దీర్ఘంగా నిట్టూర్చాడు స్పెషలిస్ట్.

"ఏమైంది డాక్టర్?" అంటూ ఆదుర్దాగా అడిగాడు రాజారావ్.


"ఏం చెప్పను. ఇదో అరుదైన జబ్బు. ఈ దేశంలో అతి కొద్దిమందికి మాత్రమే వస్తుంది" అన్నాడు డాక్టర్ గంభీరంగా.



"నాకే దురలవాట్లు లేవండీ. ఆరోగ్య సూత్రాలన్నీ పాటిస్తాను. సిగరెట్టు కాల్చను. ఆల్కహాల్ ముట్టుకోను."

"నువ్వు ఆల్కహాలిక్‌వు కాదు బాబూ. వర్క్‌హాలిక్‌వు. అదే వచ్చిన చిక్కు. పని ఒత్తిడితో నీ బుర్ర అలసిపోయింది. నీక్కావలసింది మందులు కాదు. విశ్రాంతి. విశ్రాంతి అంటే ఏమిటో తెలుసా? ఏమీ ఆలోచించకూడదు. దేని గురించీ బుర్ర బద్దలు చేసుకోగూడదు. ప్రశాంతంగా ఉల్లాసంగా గడపాలి. ఓ పదిహేను రోజుల పాటు ఎక్కడైనా తిరిగిరా. ఇదే నా ప్రిస్క్రిప్షన్. మరో సారి చెబుతున్నాను. ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోకు. ప్రపంచ సమస్యలన్నీ పరిష్కరించే బరువైన బాధ్యత నీ మీద వేసుకోకు." అంటూ చిరునవ్వు నవ్వి, భుజం తట్టి, ఫీజు జేబులో వేసుకొన్నాడు డిటెక్టివ్.

***



ప్రకృతి అందాలకు పుట్టిల్లు కేరళ. సముద్రం, బ్యాక్ వాటర్స్. కొబ్బరితోటలు. పడవలు. అడవిలో టూరిస్టు హోటళ్ళు. ఏనుగులు. కాయకల్ప చికిత్సలు. అక్కడే ఉండిపోవాలనిపించింది రాజారావుకు. కాని పర్మినెంటుగా అక్కడే ఉంటానంటే స్వర్గం కూడా నరకమవుతుంది. మద్రాసుకు వచ్చి హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు రాజారావు. ఏసి కోచ్‌లో హాయిగా ఉంది ప్రయాణం. తనతో పాటు మరో ముగ్గురున్నారు కేబిన్‌లో. కొంత అరవంలో, కొంత ఇంగ్లీషులో కబుర్లు చెప్పుకుంటున్నారు. రాజారావు తమిళం మాట్లాడలేడు గానీ అర్థం చేసుకోగలడు. డాక్టరు సలహా ప్రకారం తను ఇతరుల విషయాల్లో ఆసక్తి కనపర్చకూడదు. ఆలోచించకూడదు. కాని కథలు చెప్పుకుంటుంటే వినకుండా ఉండడం సాధ్యపడదు. మీరైతే చెవులు మూసుకుంటారా?

ఓ వృద్ధ లాయర్ గత స్మృతులను నెమరేసుకుంటున్నాడు.

"ఇప్పటికెన్ని వేల కేసులు వాదించి ఉంటానంటారు. క్రిమినల్ లాయర్‌గా నా శక్తి మేరకు ఎందరో నేరస్తులకు శిక్షలు పడేలా చేశాను. కేసు మన వద్దకు వచ్చినప్పుడు అంతా మిస్టరీగా ఉంటుంది. నేరస్తుడెవరో, బాధితుడెవరో తెలియదు. అబద్ధాల కోర్లు కూడా కన్నీరు కార్చి తాము అమాయకులమంటారు. ఉదాహరణకు ఇరవై ఏళ్ళ క్రితం నేనో కేసు తీసుకున్నాను. తలాతోకా కన్పించని అలాంటి మిస్టరీని నేనెక్కడా చూడలేదు. అది సాల్వ్ చేయడం బృహస్పతికి కూడా సాధ్యమో కాదో నాకు తెలియదు. వింటారా?" అంటూ ప్రారంభించాడు.

ఇద్దరు ప్రయాణీకులు ముందుకి వంగి "చెప్పండి" అన్నారు. రాజారావు కళ్ళు మూసుకొని, చెవులు రిక్కించి, ఉత్సుకతతో ఆ కథనాన్ని ఆస్వాదించాడు.

"చిన్న ఊళ్లో జరిగిన సంఘటన కనుక దీనికంత పబ్లిసిటీ కూడా వచ్చి ఉండదు. కానీ ప్రాక్టీస్ చేస్తున్న మా కొలీగ్స్ అందరూ టెక్స్ట్‌బుక్‌లోని పాఠంలా చదువుకుంటారు దాన్ని. మురుగప్ప చెట్టియార్ హత్య కేసుగా ఆరోజుల్లో కొంత సంచలనం సృష్టించింది. హంతకుడు లేదా హంతకులు పక్కా ప్రణాళిక ప్రకారమే ఆయన్ను చంపారు. సాక్ష్యాలు లేకుండా చేశారు. వాదించడానికి నాకే ఆధారమూ మిగల్లేదు.

ఆ ఊళ్ళోని పెద్ద ఫైనాన్స్ వ్యాపారి మురుగప్ప. వడ్డీ వ్యాపారానికి మరో పేపరు ఫైనాన్స్. అంతే కాదు మనిషి మంచివాడే. ధర్మవడ్డీ మాత్రమే వసూలు చేసేవాడు. శత్రువులు లేరు. పైగా బడికీ, గుడికీ, అనాథాశ్రమానికీ విరాళాలు ఇచ్చి తన దాతృత్వం చాటుకున్నాడు.

ఆయనకిద్దరు మేనల్లుళ్ళున్నారు. ఒకడు నటేశన్. మరొకడు శరవణన్. వాళ్ళ తండ్రి ఆస్తిని తాగి, జూదమాడి, తగలేస్తే, ఈ మహానుభావుడే పిల్లల్ని చేరదీసి తనకు అసిస్టెంట్లుగా పెట్టుకున్నాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే ఆ పిల్లల తల్లీ, తండ్రీ మరణించారు. అనాథలైన ఆ కుర్రాళ్ళను సంతానం లేని మురుగప్ప సొంత పిల్లలాగే చూసుకున్నాడు.

కుర్రాళ్ళు కూడా మంచివాళ్లే. బుద్ధిమంతులు. పెద్దవాడికి, ఇరవై నాలుగో, అయిదో ఉంటాయి. తమ్ముడు వాడి కన్నా రెండేళ్ళు చిన్న. ఇద్దరి మధ్యా దాయాది వైరం ఉందనీ, ఎవరికీ అనుమానం కూడా రాలేదు.

అయితే, వాళ్ళకు వ్యాపారం మీద పెద్దగా ఆసక్తి లేదు. డబ్బెందుకు? సుఖంగా బ్రతకడానికి. మేనమామకు వయసు మళ్ళింది. త్వరలో వస్తాడు. ఆ తర్వాత ఆస్తంతా తమదే. మరెందుకు పని చెయ్యడం? కాని ముసలాళ్ళు ఓ పట్టాన చావరు. కాళ్ళూ చేతులూ కద పలేకపోయినా, ఎండిన మోడుల్లా సంవత్సరాలు బతికేస్తారు. పాపం, డబ్బు త్వరగా చేతికొస్తే, చెరి సగం పంచుకొని, తరువాత కాలు మీద కాలేసుకొని బతికేద్దామనుకున్న కుర్రాళ్ళకెంతో నిరాశ కలిగింది. నిజమే. ముసలి మురుగప్ప వాళ్ళ సహనాన్ని పరీక్షించాడు.

అయితే, ఈ కేసులో మరో పీట ముడి ఉంది. మురుగప్ప నాకు బాగానే తెలుసు. అప్పుడప్పుడూ న్యాయ సలహాల కోసం నా వద్దకు వస్తూండేవాడు. మేనల్లుళ్ళకు వ్యాపారం మీద శ్రద్ధ లేదన్నదే ఆయన బాధ. ఆ కుర్రాళ్ళకు నాటకాల పిచ్చి బాగా ఉండేది. తీరిక దొరికినప్పుడల్లా స్వయంగా రాసి ప్రదర్శించే వాళ్ళు. ఆ కళలో వాళ్ళకొంత ప్రతిభ కూడా ఉందని నేనూ నమ్మాను. ఇద్దరూ జంటకవులు. గనుక ఎవరే పోర్షన్ రాశారో తెలుసుకోవడం ప్రేక్షకులకు అసాధ్యం. (అదంత ముఖ్యం కూడా కాదనుకోండి) ముఖ్యంగా వడ్డీ వ్యాపారి ఇంట్లో కళాకారులుండడం అందర్నీ కాస్త ఆశ్చర్య పరిచే విషయం.

ఒకనాడు మురుగప్ప హత్య జరిగింది. రివాల్వర్‌తో నుదుటి మీద, పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చారు. ఆ ఉదయం నాకు వచ్చిన తొలి ఫోన్ కాల్ అదే. మేనమామను చంపినందుకు నటేశన్‌ను అరెస్ట్ చేశారు. ఆ కుర్రాడు హత్య చెయ్యగలడంటే నేను నమ్మలేదు. హడావిడిగా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను. నిర్వికారంగా లాకప్‌లో కూర్చున్నాడు నటేశన్.

"ఏమైంది? ఎందుకిలా చేశావు? నేను నమ్మలేకుండా ఉన్నాను" అంటూ సమాచారం రాబట్టటానికి ప్రయత్నించాను.

"నేను హత్య చేశానని వాళ్ళ అభిప్రాయం" అన్నాడు నటేశన్. అదేదో తనకు సంబంధించని విషయం అయినట్టు.

జరిగిందానికి భయపడాల్సింది అతడా? నేనా?

"ఇది ఆషామాషీ విషయం కాదు. పోలీసులు కేసు నిరూపించగలిగితే నీకు ఉరిశిక్ష తప్పదు" అన్నాను.

"నన్నేం చెయ్యమంటారండి. అర్ధరాత్రి దాటాక వచ్చారు పోలీసులు. నేనూ, శరవణ్ గాడూ గదిలో ఉన్నాం. అయిదారు ప్రశ్నలు వేసి, అంకుల్ హత్య జరిగింది గనుక నన్ను అరెస్ట్ చేస్తున్నామన్నారు. వాళ్ళతో వాదించే ఓపిక నాకు లేదు. సరే. ఏం చేసుకుంటారో చేసుకోండని ఇక్కడికొచ్చాను."

"అంటే, వాళ్ళ దగ్గర సాక్ష్యాలున్నట్టే కదా?"

"ఆ విషయం కోర్టులో తేలుతుంది. మీరు శరవణ్ గాణ్ణి క్రాస్ ఎగ్జామిన్ చేయండి. నేను మాత్రం నేరం చేశానని అంగీకరించను. అంతా మా తమ్ముడే చూసుకొంటాడు" అన్నాడు నటేశన్.

నాకు పెద్ద సందేహమే వచ్చింది. వీళ్ళిద్దరూ కలిసి ఓ నాటకమాడబోతున్నారు.

"మీరు ఇటీవల లా పుస్తకాలు చదువుతున్నారా ఏమిటి?" అని అడిగాను.

"అవును. డిటెక్టివ్ నవలల కన్నా ఎక్కువ ఇంటరెస్టింగ్‌గా ఉంటాయి 'లా' బుక్స్."

ఆ తర్వాత శరవణ్‌తో కూడా మాట్లాడేను గాని అదనపు సమాచారమేమీ రాబట్టలేకపోయాను.

ఇక, కోర్టులో కేసు విచారణకు వచ్చినప్పుడు నా బుర్ర ఎంత వేడెక్కి ఉంటుందంటారు. నా క్లైంటే నన్ను సస్పెన్సులో పెట్టారాయె. ప్రెస్సు వాళ్ళతో, ప్రేక్షకులతో హాలు కిక్కిరిసిపోయింది. ముద్దాయి సహకరించనప్పుడు డిఫెన్స్ లాయరేం చెయ్యాలి? రెండు నిమిషాల్లో శిక్షపడక తప్పదని డిఫెన్స్ ప్రాసిక్యూటర్ మహా ఆనందపడిపోతున్నాడు. ఇద్దరం మిత్రులమే అయినా, ఇంత బలహీనమైన కేసు ఆర్గ్యూ చేస్తున్నందుకు నన్నో చాతకాని దద్దమ్మలా చూశాడు.

హత్యకు కారణం స్పష్టమే. సుమారు కోటి రూపాయల ఆస్తి దక్కించుకోవచ్చు. బెంచీ క్లర్కు టేబుల్ మీద రివాల్వర్ (ఎక్జిబిట్ నెం.1) ఉంది. అందులో ఒక బుల్లెట్ తక్కువగా ఉంది. నటేశన్ తాను పోలీసులకు రాసిచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ కూడా ఉంది. అతడు తనను తాను రక్షించుకుంటే తప్ప నేను చెయ్యగలిగిందేమీ లేదు.

కవిత

## వాఘా సరిహద్దు




మానవ జీవితాల మధ్య మొలిచిన
ఉద్విగ్న రేఖను ఎప్పుడైనా చూశారా?
అయితే వాఘా బార్డర్‌కు రండి.
అమృత్‌సర్ దగ్గర
ఇండియా పాక్‌ల మధ్య మొలిచిన రాచపుండు
ఇది.
బ్రిటిషు వాడు ఒకప్పుడు
ఆసియా మ్యాపుపై గీసిన మొరటు గీత
అనుబంధాలను చీల్చిన రక్తరేఖ.

సరిహద్దు అంటే
'ఏం తెలుసునీకు?' అన్నాడు పంజాబీ మిత్రుడు.
'బార్డర్‌పైనే పుట్టాం మేం
బార్డర్ మాలో ప్రవహిస్తుంది
బార్డర్ మా జీవితం
బార్డర్ మా భయం
బార్డర్ మా సాహసం
బార్డర్ మా పోరాటం
దూర తీరాల్లో వున్న మీకు
మా అలజడి కేవలం ఒక వార్త.
రెండు దేశాల్లోని దొరల పుర్రెల్లో పుట్టిన బుద్ధి
బార్డర్‌పై మంటలను రగిలిస్తుంది.

ఎదురెదురుగా
రెండు దేశాల గేట్లు
రెండు దేశాల జెండాలు.
గేట్లు ఎందుకు తెరుచుకుంటాయో
ఇద్దరికీ తెలియదు.
జెండాలు ఎంత రెపరెపలాడితే
అంత ఉత్తేజం!
రిమోట్‌తో నడిచే
రోబో సైనికులు వీళ్లు
మనుషులు కారా వీళ్లు?
రోజంతా పలకరింపుల పూలవర్షం
ఇనుపగేట్లకు స్నేహాలు
మల్లెతీగల్లా అల్లుకుంటాయి.

ప్రతి సాయంత్రం పూట రిట్రీట్‌లో
కవాతులు శత్రుభావాన్ని
ప్రజ్వలితం చేస్తాయి.
రెండు పక్కలా ప్రజలు
దేశభక్తి గీతాల్తో తిట్టుకుంటారు.
చిత్రంగా ఆ గాయకులు
ఇద్దరికీ కావలసిన వాళ్ళే.
అవరయ్యేళ్ల శత్రుభావాలు!
చల్లారని ద్వేష విధానాలు!!

రోజంతా పదఘట్టనలతో
పొక్కిలైన సరిహద్దు
అలసటతో ఆవలిస్తుంది.
సరిహద్దును నిద్రపుచ్చి
భారంగా వెనక్కి కదుల్తారిద్దరూ.

ఇంటిముఖం పట్టిన మనస్సుల్లో
ఏదో అసహజమైన భావన.
అంతరాంతరాల్లో
ముళ్ళ తీగలు తెగుతున్న చప్పుడు!

*

ప్రముఖ పంజాబీ కవి
స్వరణ్‌జీత్ సవికి అంకితం

–డా.ఎన్.గోపి

నటేశన్ చెప్పినట్టే, మొదట శరవణన్‌ను ప్రశ్నించాను. ఈ కుర్రాడేది చెబుతాడో కూడా నాకు తెలియదు. పెళ్ళికొచ్చినట్టుగా నీట్‌గా డ్రస్ చేసుకుని వచ్చాడు శరవణన్. వాడికి, కోర్టు హాలంటే నాటకశాల కాబోలు జడ్జి ముందర ఆడుతున్న నాటకంలో తను హీరో. ప్రమాణం చేసి, "అడగండి" అన్నట్టుగా నా వైపు చూశాడు. పైగా, ఆ మొహం మీద చిరునవ్వొకటి. కోర్టుల్లో, సాధారణంగా ముద్దాయిలు నవ్వరు. లా చూస్తే, జడ్జిని ధిక్కరిస్తున్నాడనుకునే ప్రమాదం ఉంది.

"హత్య జరిగిన రాత్రి నువ్వెక్కడున్నావు?" అంటూ ప్రశ్నించాను.

"చెబుతాను" అంటూ జుత్తు వెనక్కు దువ్వుకొని, షర్టు బొత్తాములు సరిచేసుకొని, గొంతు సవరించుకొన్నాడు శరవణన్. జడ్జిగారు అసహనంగా కదిలారు. ఆయనక్కోపం వచ్చిందని తెలుసు.

"ఆరాత్రి నేను అంకుల్ మురుగప్ప గారింట్లోనే ఉన్నాను. దగ్గిర రివాల్వర్ కూడా ఉంది. అదిగో, అదే. పోలీసులు వచ్చి, నాతో ఒక్క మాటైనా మాట్లాడకుండా మా అన్న నటేశన్‌ను అరెస్ట్ చేసి తీసుకునిపోయారు. నన్నడిగితే చెప్పేవాణ్ణిగా. హత్య చేసింది నేనే."

కేసు విచారణ అంటే సస్పెన్సు కథ చదవడం కాదు. కాని శరవణన్ స్టేట్‌మెంట్ విని, జడ్జీతో సహా హాల్లో ఉన్న వాళ్ళంతా నిర్ఘాంతపోయారు.

"కేసు వాయిదా వెయ్యమని అడగొద్దు. ఆర్గ్యుమెంట్ కంటిన్యూ చేయండి." అన్నాడు నటేశన్ నా చెవిలో.

అప్పుడర్థమైంది వీళ్ళాడుతున్న డ్రామా. నేరస్తుల మీదైనా సానుభూతి కలుగుతుందేమోగానీ, చట్టాలలోని లొసుగులను లేదా అస్పష్టంగా ఉన్న కొన్ని అంశాలను ఆధారంగా తీసుకుని, లాయర్లనూ, జడ్జిలనూ అవహేళన చేసేవాళ్ళంటే నాకసహ్యం. అయితే, దానిక్కూడా కొంత తెలివి తేటలు కావాలి. అది వేరే విషయం. శరవణన్‌ను మరిన్ని ప్రశ్నలడిగాను. జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పుకున్నాడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. కథలు చెప్పటంలో శరవణన్ తనకు తానే సాటి. మొదటిసారి మురుగప్ప ఆస్తి మీద ఎప్పుడు కన్ను పడిందీ, ఎంత జాగ్రత్తగా ప్లాను వేసిందీ, సవిస్తరంగా చెప్పాడు. జడ్జిగారు కూడా మంత్రముగ్ధుడై విన్నాడు.

"ఎవరెన్ని చెప్పినా చట్ట ప్రకారమే మనం ప్రొసీడ్ కావాలి. నటేశన్ కన్‌ఫెషన్‌ను కోర్టు వారు పరిగణనలోకి తీసుకున్నప్పటికీ, శరవణన్ చెప్పింది కూడా కాదనటానికి సరైన ఆధారాలు లేవు. హంతకుడెవరో తేలిందాకా. మనం ఎవరికీ శిక్ష విధించలేం." అంటూ నా వాదన ముగించాను.

సహజంగానే కోర్టు వారి ఆదేశాల ప్రకారం, శరవణన్‌ను అరెస్ట్ చేశారు. నటేశన్‌ను విడుదల చేశారు.

కానీ నా సందేహం తీరేదెలా? జైల్లో శరవణన్ కలిసి, "మీ ఇద్దర్లో ఒకరు మురుగప్పను చంపారు. నేను మీ డిఫెన్స్ లాయర్ని కదా. నాకైనా నిజం తెలియకూడదా?" అంటూ వేడుకున్నంత పనిచేశాను.

"మీకు తెలియాల్సిన అవసరం లేదు" అన్నాడు శరవణన్.

"మీ అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. మీ అన్నను నువ్వు రక్షించావు. ఇప్పుడు ఆస్తంతా నటేశన్‌కే దక్కుతుంది. నువ్వేమో ఉరికంబం ఎక్కుతావు. ఇదెక్కడి న్యాయం?" అన్నాను. అతణ్ణి ప్రొవోక్ చెయ్యాలని.

"డోంట్ వర్రీ లాయర్‌గారూ. మేం పర్‌ఫెక్ట్‌గానే ప్లాన్ చేశాం. ఎవరికీ ఏమీ జరగదు" అన్నాడు శరవణన్ చదరంగంలో ప్రత్యర్థిని చెక్‌మేట్ చేసినంత ధీమాగా.

"ఓకే. నీ చతురతకు నా జోహార్లు. కనీసం, నా తృప్తి కోసం అసలు విషయం చెప్పు. ఇద్దర్లో ఎవరు చంపారు? అసలా నిర్ణయం ఎలా తీసుకొన్నారు?"

"సింపుల్. బొమ్మా బొరుసు వేసుకొన్నాం."

అది ఆత్మ విశ్వాసమా? అహంకారమా? చట్టంతో చెలగాటమా?

నేను నిరూపించడానికి ఆధారాలు లేవు. ఇద్దరు కుర్రాళ్ళు పోలీసు వ్యవస్థనూ, కోర్టులనూ అపహాస్యం పాలు చేస్తున్నారు. శరవణన్ అంత ధైర్యంగా ఎలా ఉండగలుగుతున్నాడు?

ఒకసారి కోర్టు, ఒక ముద్దాయిని "నాట్ గిల్టీ" అని తీర్పు ఇచ్చిన తరువాత వాడి మీద తిరిగి విచారణ జరపకూడదు. (జుట్టు పీక్కున్నా, గోళ్ళు కొరుక్కున్నా తేలే విషయం కాదిది) అయినా, జడ్జీగారు తన ప్రత్యేకాధికారాలతో నటేశన్‌ను మళ్ళీ బోనెక్కించారు.

"ఎన్ని సార్లు చెప్పాలండీ. నేను హత్య చేశానని అంగీకరించాను. చెయ్యలేదని తీర్మానించి మీరే విడుదల చేశారు. మళ్ళీ 'చేశావా?' అని అడుగుతున్నారు. చెయ్యలేదని నేను చెప్పానా?" అంటూ తెచ్చిపెట్టుకున్న కోపంతో అరిచాడు నటేశన్.

"అన్నదమ్ముల్లో ఒకడు హంతకుడు. ఇద్దరూ నా క్లయింట్లే. కాని ఒకడు 'గిల్టీ' మరొకడు 'నాట్ గిల్టీ' కాస్త టైమివ్వండి. నేనే నిరూపిస్తాను" అనికోర్టు వారికి విన్నవించుకున్నాను.

"ఇద్దరూ ఒకరి కోసం ఒకరు ప్రాణాలర్పించుకోవడానికి సిద్ధపడ్డారా? లేదా ఒకరినొకరు ఉరికంబమెక్కించడానికి ప్రయత్నిస్తున్నారా?" అంటూ వృద్ధ లాయర్ అలసటగా వెనక్కు వాలాడు.

"నిజమే సార్ ఇలాంటి మిస్టరీ మేమెప్పుడూ వినలేదు" అన్నాడొక ప్రయాణీకుడు.

"అంటే, ఇద్దరూ శిక్ష నుంచి తప్పించుకున్నట్టేనా?" అన్నాడు మరొక ప్రయాణీకుడు.

"ఎంత పర్‌ఫెక్ట్ మర్డర్‌లోనైనా ఏదో ఒక పొరపాటు చేస్తాడు హంతకుడు."

"అంటే హంతకుడికి శిక్ష పడిందా?"

"ఓ ఎస్. ఇదే గదా విజయవాడ స్టేషన్. నేనిక్కడే దిగాలి." అంటూ సూట్‌కేస్ తీసుకొని బయల్దేరాడు లాయరు.

ఆతృతగా కళ్ళు తెరిచాడు రాజారావు.

లాయర్ ప్లాట్‌ఫాం మీద పోర్టర్ కోసం చూస్తున్నాడు.

రాజారావు గుండె వేగంగా కొట్టుకుంది. గ్లాస్ విండో గుండా మాటలు వినిపించవు. రెండు చేతుల్తో దబదబా బాదాడు. లాయర్ తలెత్తి చూశాడు.

ఎడమ చేయి చూపుడు వేలు ఎడమ కణత మీద పెట్టుకొని తిప్పుతూ, "ఎవరూ?" అన్నట్టుగా సైగ చేశాడు రాజారావు.

ఎడమచేయి చూపుడు వేలు ఎడమ కణత మీద పెట్టుకొని తిప్పుతూ, "ఆలోచించండి" అన్నట్టుగా సైగ చేశాడు లాయర్.

రైలు కదిలింది.

రాజారావు బుర్ర గిర్రున తిరిగింది. భరించలేని తలనొప్పి తిరిగి వచ్చింది.

**మూలం: స్టాన్లీ ఎల్లిన్**

**స్వేచ్ఛానుసరణ: రియ**

---



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### తలుపు తియ్యటం ఎలా?

"జరిగిందేమిటో చెప్పండి. నేరస్తుల్ని పట్టుకోవటానికి ప్రయత్నిస్తాం" అన్నాడు డిటెక్టివ్.

"నేను కారాపినప్పుడు, ఎవరో నా మీద క్లోరోఫాం చల్లినట్లు జ్ఞాపకం. అప్పుడు మధ్యాహ్నం రెండు గంటలై వుంటుంది. సాయంత్రానికిగాని మళ్ళీ స్పృహ రాలేదు. ఓ గదిలో వున్నాను. ఒకే ఒక కుర్చీ తప్ప మరే ఫర్నిచర్ లేదందులో. తలుపులు బయటినుండి మూసి వున్నాయి. నన్ను అపహరించినవాళ్లు ఏవో మాట్లాడుకుంటున్నారు. చెవులు రిక్కించి విన్నాను. నన్ను విడుదల చెయ్యటానికి మా నాన్న నుండి పది లక్షల రూపాయలు డిమాండ్ చెయ్యటానికి నిర్ణయించుకున్నారు. తలుపు తెరవటానికి ప్రయత్నించాను. బయటనుండి గడియవేసి వుంది. బయటకే తెరుచుకుంటాయా తలుపులు. కిడ్నాపర్లు నాకు కనీసం నీళ్లు, ఆహారం కూడా యివ్వలేదు. రాత్రంతా ఒక్కణ్ణే గడిపాను. పారిపోవటానికి వీలు వడుతుందేమోనని ప్రయత్నించాను. కాని అవకాశం చిక్కలేదు. తెల్లవారి ముసుగులు కప్పుకున్న యిద్దరు వ్యక్తులు వచ్చి తలుపు తెరిచారు. నన్ను చంపుతారేమోనని భయం వేసింది. తలుపు వెనక నక్కాను. డబ్బు దొరికిందేమో, నా కళ్ళగంతలు కట్టి చాలా దూరం తీసికెళ్లి వదిలారు. ఆ తర్వాత వెంటనే మీకు ఫోన్ చేశాను" అంటూ తన కథ ముగించాడు యువకుడు.

"గుడ్. డబ్బు లెక్కడ దాచావో చెప్పు" అంటూ గద్దించాడు డిటెక్టివ్.

యువకుడు చెప్పిందంతా కట్టు కథ అని డిటెక్టివ్ ఎలా పసిగట్టాడు?

---